సాక్షి విజయనగరం

ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024



బొత్స చొరవతో.. - 8లో

మిమ్స్‌లో సమ్మె విరమణ

మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు ఎట్టకేలకు సమ్మె విరమించారు. మంత్రి బొత్స సత్యనారాయణ చొరవతో సమస్య కొలిక్కి వచ్చింది.

మాయలోడు.. మళ్లీ వస్తున్నాడు...

హామీలు ఇవ్వడం.. మోసం చేయడం చంద్రబాబు నైజం. ఆయన ఏ ప్రాంతానికి వెళ్తున్నా మాయలోడు వస్తున్నాడన్న ప్రచారం జోరందుకుంది.



- 8లో

రేపే పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుకు ఆఖరు

విజయనగరం అర్బన్: ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ పొందేందుకు ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు అందజేయాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. పోస్టల్ బ్యాలెట్లను పొందేందుకు అర్హత ఉన్నవారికి దరఖాస్తు ఫారాలను అందజేశామన్నారు. గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించేది లేదని శనివారం స్పష్టంచేశారు.

న్యూస్‌రీల్

మూడో రోజు 14 నామినేషన్లు దాఖలు



జేసీ కె. కార్తీక్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ విజయనగరం ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం అర్బన్: జిల్లాలో మూడో రోజు శనివారం నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 14 నామినేషన్లు దాఖలయ్యాయి. విజయనగరం ఎంపీ స్థానానికి ఒక్క నామినేషన్ కూడా రాలేదు. విజయనగరం అసెంబ్లీ స్థానానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కోలగట్ల వెంకటరమణి మూడు సెట్లను, యుత తులిసి పార్టీ తరపున మల్లాప్రగడ బుచ్చి గురునాతశర్మ ఒక సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. చీపురుపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ తరఫున బొత్స సందీప్ రెండు సెట్లను, బొత్స సత్యనారాయణ ఒక సెట్‌ను దాఖలు చేశారు. నెల్లిమర్లలో స్వతంత్ర అభ్యర్థిగా కోల వర్షిణి నామినేషన్ వేశారు. బొబ్బిలిలో ముగడ వెంకటరమణ కాంగ్రెస్ పార్టీ తరఫున, స్వతంత్ర అభ్యర్థిగా ఒక్కోసెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు.

నేడు మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష

- జిల్లా వ్యాప్తంగా 14 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

విజయనగరం అర్బన్: జిల్లాలోని 13 ఏపీ మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యాసంవత్సరంలో ఆరో తరగతిలో సీట్ల ప్రవేశానికి ఆదివారం జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తామని డీఈఓ ఎన్.ప్రేమకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు జిల్లాలో 3,669 మంది విద్యార్థులు హాజరుకానున్నారని చెప్పారు. మండల కేంద్రాల్లోని మోడల్ స్కూల్స్‌లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ హాల్ టికెట్లను 'సీఎస్‌ఈ.ఏపీ.జీఓవి.ఐఎన్' లేదా ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్.ఐఎన్/స్టూడెంట్ లాగిన్.డీఓ వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరుకావాలని కోరారు. పరీక్ష తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుందన్నారు.

టెన్నిస్ పోటీల్లో సత్తా చాటిన సన్యాసిరాజు



సన్యాసిరాజును అభినందిస్తున్న క్రీడాకారులు

విజయనగరం: బెంగళూర్‌లో ఈ నెల 17 నుంచి నిర్వహించిన ఆల్ ఇండియా సీనియర్స్ టెన్నిస్ చాంపియన్‌షిప్-65 ప్లస్ విభాగంలో విజయనగరానికి చెందిన పి.సన్యాసిరాజు పతకాల పంట పండించారు. సింగిల్స్‌లో ద్వితీయ స్థానం, డబుల్స్‌లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. ఆయన ఎస్‌బీఐ ఉద్యోగిగా ఉద్యోగ విరమణ చేసిన అనంతరం చింతలవలస క్రికెట్ అకాడమీకి సేవలందిస్తున్నారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్న రంజీ మాజీ ప్లేయర్ సన్యాసిరాజును ఆఫీసర్స్ క్లబ్ టెన్నిస్ క్రీడాకారులు, టెన్నిస్ అసోసియేషన్ అభినందించింది.

అశోక్‌వనంలో గీత

- అదితి రాజకీయ భవిష్యత్తు కోసం మీసాల గీతకు చెక్
- బంగ్లాలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో అడుగుపెట్టనీయని వైనం
- గీతపైనే తప్పులు నెట్టేస్తూ పార్టీ నుంచే గెంటేసేలా ఎత్తుగడ
- అశోక్ కళ్లల్లో ఆనందం కోసం నోరెత్తని చంద్రబాబు
- ఆత్మగౌరవం కోసం 'బంగ్లా'పై గీత తిరుగుబాటు
- విజయనగరంలో రెబల్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో అడుగు
- సొంత సామాజికవర్గ నేతలు, అభిమానులతో కలిసి ప్రచారం

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

అశోక్ బంగ్లా... ఉమ్మడి విజయనగరం జిల్లా టీడీపీ శ్రేణులను కన్నుసన్నల్లో నేటికీ శాసిస్తోంది. అక్కడ అడుగు పెట్టాలంటే రాచరికానికి గులాంగిరీ చేయాల్సిందే! ఇతర ప్రాంతాల్లో ఆ పార్టీలోని ఎంత పుడింగి నాయకుడైనా, రాజకీయాల్లో ఎంత కొమ్ములు తిరిగినవారైనా అక్కడ తలదించాల్సిందే! ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాలు అంతరించిపోయినా విజయనగరంలో మాత్రం దశాబ్దాలుగా ఆ బానిస సంకెళ్లు కొనసాగుతూనే ఉన్నాయి. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనంతో 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఆ సంకెళ్లు తెగాయి. విజయనగరం లోక్‌సభ స్థానానికి పోటీచేసిన అశోక్‌ను బెల్లాన చంద్రశేఖర్, విజయనగరం అసెంబ్లీ స్థానంలో తొలిసారిగా అడుగుపెట్టిన అదితిని కోలగట్ల వీరభద్రస్వామి ఓడించి విజయబావుటా ఎగురవేశారు. దీంతో ప్రజలకు స్వేచ్ఛ లభించినా టీడీపీ నాయకులు మాత్రం ఇంకా అక్కడే రాజుల అడుగులకు మడుగులొత్తుతున్నారు. రాచరికపు జాఢ్యాన్ని రాజకీయాల ద్వారా కొనసాగించడానికి అశోక్ కుటిల యత్నాలతో విసిగిపోయి ఆత్మగౌరవం కోసం ఇప్పటికి ఇద్దరు మాత్రమే గీత దాటారు. ఉమ్మడి జిల్లాలో బలమైన సామాజికవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు మీసాల గీత, కొండపల్లి అప్పలనాయుడు (కె.ఎ.నాయుడు) తిరుగుబాటు చేశారు. అశోక్ నిరంకుశత్వాన్ని ఎదిరిస్తూ బంగ్లాకు పోటీగా టీడీపీ కార్యాలయాలను తెరిచి మరీ సవాల్ విసిరారు. కానీ, బంగ్లా దెబ్బకు వారిద్దరి సీట్లు గల్లంతయ్యాయి. ఇంకా గజపతినగరం టికెట్‌పై ఆశతో కె.ఎ.నాయుడు కుక్కినపేనులా పడివున్నా విజయనగరంలో మీసాల గీత మాత్రం ఆత్మగౌరవం కోసం అదితిపై యుద్ధానికి సిద్ధమయ్యారు. రెబెల్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. తన సామాజికవర్గ నేతలు, అభిమానుల అండగా ఎన్నికల బరిలోకి దిగారు. తనకే గాకుండా టీడీపీలో అనేక మందికి అవమానాలు మిగుల్చుతున్న బంగ్లా బందిఖానాను బద్దలుకొట్టాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.



విజయనగరంలో బంగ్లాకు పోటీగా మీసాల గీత ప్రారంభించిన టీడీపీ కార్యాలయం

అశోక్ ఉద్ధరించేందేమిటి?

రాజరికంపై భయ భక్తులతో అమాయకులైన విజయనగరం ప్రజలు దశాబ్దాలుగా అశోక్ కుటుంబాన్ని నెత్తిన మోశారు. వారి ఓట్లతో గెలిచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రి పదవులు పొందినా అశోక్ ఏ రోజూ ప్రజల సంక్షేమం, జిల్లా అభివృద్ధి గురించి ఆలోచించిందీ లేదు. తాను చేసింది ఇదీ అని చెప్పుకోవడానికి ఒక్కటంటే ఒక్కటీ కనిపించదు. చివరకు తాను సెల్ఫీ చాలెంజ్‌లో చూపించిన విజయనగరం ఔటర్ రింగ్‌రోడ్డు కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే నిర్మాణం పూర్తికావడం గమనార్హం. ఆయన చొరవ తీసుకొని చేసిందీ ఏదైనా ఉందంటే అది ఆయన బంగ్లాకు వెళ్లే ఆర్‌ఓబీ (సంతకాల వంతెన) మాత్రమే. ఒకప్పుడు విజయనగరం సామ్రాజ్యంలో చిన్న మత్స్యకార గ్రామమైన విశాఖ ప్రపంచంలోనే మేటి నగరంగా ఎదిగింది. కానీ ఆ రాజ్యానికి ముఖ్యనగరమైన విజయనగరం 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేంత వరకూ ఒక పెద్ద పల్లెటూరుగానే మిగిలిపోయింది. ఇన్నాళ్లకు ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి చొరవతో విజయనగరం రూపురేఖలు మారాయి. కార్పొరేషన్ హోదాకు తగ్గట్టుగా సదుపాయాలు సమకూరాయి. నగర వాసులు సేదతీరేందుకు, కుటుంబంతో కలిసి కాసేపు ఆహ్లాదంగా గడిపేందుకు వీలుగా పర్యాటక ప్రదేశాలు, పార్కులు ముస్తాబయ్యాయి. చరిత్రకు సాక్షిగా నగరంలోని కూడళ్లు ఆధునిక సొబగులు అద్దుకున్నాయి.

కుమార్తె కోసం కుయుక్తులు...

ప్రజల సంక్షేమానికి, జిల్లా అభివృద్ధికి ఏ మాత్రం ఉపయోగపడని రాజరికాన్నే మళ్లీ ప్రజలపై రుద్దడానికి అశోక్ బంగ్లా కేంద్రంగా రాజకీయాలు సాగుతున్నాయి. కుమార్తె పూసపాటి అదితి విజయలక్ష్మి రాజకీయ భవిష్యత్తు కోసం 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు నుంచే కుయుక్తులు ప్రారంభమయ్యాయి. విజయనగరం మున్సిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా పనిచేసిన మీసాల గీతకు నాటి నుంచే చెక్ పెడుతూ వచ్చారు. తమది బీసీల పార్టీ అంటూ చంద్రబాబు గొంతు చించుకునే టీడీపీలోనే తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన ఆమె ఆవేదన మాత్రం ఏ రోజూ వినలేదు. అశోక్ కళ్లల్లో ఆనందం కోసం గీత గోడు పట్టించుకోలేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే గీతకు గాకుండా రాజకీయాల్లో ఓనమాలు కూడా తెలియని, ఏ రోజూ ప్రజలకు సేవ చేయని అదితికి 2019 ఎన్నికల్లో చంద్రబాబు టికెట్ ఇచ్చారు. బీసీలకు అన్యాయం చేసిన తండ్రీ కూతుళ్లకు జిల్లా ప్రజలు బుద్ధి చెప్పారు. కానీ ప్రజలపై కోపం గీతపై చూపించారు. ఆమెను ఏరోజూ బంగ్లాలో అడుగుపెట్టనీయలేదు. టీడీపీ కార్యక్రమాలకు పిలిచిందీ లేదు. దీంతో ఆమె విజయనగరంలో ప్రత్యేకంగా టీడీపీ కార్యాలయం పెట్టుకోవాల్సి వచ్చింది.



టీడీపీ రెబల్ అభ్యర్థిగా ప్రచారం చేస్తున్న మీసాల గీత

గీత ఆశలు అడియాసలు...

'మీరు మా కుటుంబ సభ్యులు. మీ భవిష్యత్తుకు ష్యూరిటీ మాది' అంటూ చంద్రబాబు, లోకేశ్ చెప్పిన మాటలు మీసాల గీతలో ఆశలు కలిగించాయి. 2019 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత విజయనగరానికి మూడేళ్ల పాటు ముఖం చాటేసిన అదితికి మళ్లీ టికెట్ ఇవ్వరని, బీసీ మహిళగా తనకు అవకాశం ఇస్తారని భావించారు. తీరా ఎన్నికల సమయం రాగానే అశోక్ మళ్లీ తన కుమార్తె అదితికే విజయనగరం టికెట్ దక్కేలా చక్రం తిప్పారు. గీతకు మాత్రం పూటకో చోట టికెట్ ఆశ చూపిస్తూ చుక్కలు చూపించారు. నెల్లిమర్ల, గజపతినగరం, ఎచ్చెర్ల, చీపురుపల్లి అసెంబ్లీ స్థానాలతో పాటు విజయనగరం లోక్‌సభ టికెట్ కూడా ఆమె పేరు పరిశీలిస్తున్నట్టు ఎప్పటికప్పుడు చంద్రబాబు, లోకేశ్ మభ్యపెడుతూ వచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బరిలోకి దిగే టీడీపీ అభ్యర్థుల జాబితాలో గీత పేరు గల్లంతయ్యింది. ఆమె ఆశలు అడియాసలయ్యాయి. దీంతో ఆమె తన సత్తా చాటుకునేందుకు బరిలో దిగారు. అదితి కంటే అధిక ఓట్లు సాధించడమే లక్ష్యంగా తన అనుచరులతో కలిసి ప్రచారం చేస్తున్నారు.

ఆర్థిక లావాదేవీలపై పటిష్ట నిఘా



మాట్లాడుతున్న రాష్ట్ర వ్యయ పరిశీలకురాలు నీనా నిగం

- బ్యాంకు డిపాజిట్లపై దృష్టి సారించాలి
- జిల్లాలో చేపట్టిన చర్యలను పీపీటీ ద్వారా వివరించిన కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆర్థిక లావాదేవీలు, ఖర్చులు, ఇతర వ్యయాలపై పటిష్ట నిఘా ఉంచాలని జిల్లా అధికారులను రాష్ట్ర వ్యయ పరిశీలకులు నీనా నిగం ఆదేశించారు. వ్యయ పరిశీలకులు ప్రభాకర్ ప్రకాష్‌రంజన్, ఆనంద్ కుమార్, ఆకాశదీప్‌లతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఆర్థిక లావాదేవీలు, నగదు బట్వాడా, బహుమతులు, ఇతర వస్తువుల తరలింపు, మద్యం రవాణా తదితర అంశాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. జప్తు చేసిన నగదు, వస్తువుల వివరాలను ఈఎస్‌ఎంఎస్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు. తొలుత జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి జిల్లాలో చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రణాళికను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. 4 చోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, విస్తృత తనిఖీలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు వస్తు, ధన రూపేణా రూ.4.2 కోట్ల నగదును సీజ్ చేశామని చెప్పారు. ఫిర్యాదుల స్వీకరణ, మీడియా పర్యవేక్షణ, మోడల్ కోడ్ అమలు, సీ-విజిల్ తదితర సేవల కోసం 24/7 పని చేసేలా కంట్రోల్ రూమ్ నుంచి సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టామని తెలిపారు. సమావేశంలో పోలీస్, రెవెన్యూ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, డీఆర్‌ఐ, పోస్టల్, కస్టమ్స్, ఇన్‌కమ్‌ట్యాక్స్, బ్యాంకు, అటవీ, రైల్వే, ఐటీ, జీఎస్టీ, రవాణా తదితర శాఖల అధికారులు ఆయా విభాగాల ఆధ్వర్యంలో ఇప్పటి వరకు చేపట్టిన చర్యలను వివరించారు. సమావేశంలో జేసీ కె.కార్తీక్, ఎస్పీ దీపికా పాటిల్, సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, అదనపు ఎస్పీ అస్మఫర్హీన్, డీఆర్వో అనిత తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఎన్నిక కంట్రోల్ రూమ్‌ను రాష్ట్ర పరిశీలకులు పరిశీలించారు.

వారిది అడ్డదారి!

- టీడీపీ హయాంలో అంతా దౌర్జన్యమే..
- ప్రశ్నించే అధికారులపై దాడులు
- 2017-18లో గంట్యాడలో 1000 బస్తాల వరి విత్తనాలు రాత్రికి రాత్రి తరలింపు
- సొసైటీ నుంచి నాయకుల ఇళ్లకు తరలించిన వైనం
- సంబంధిత అధికారి నుంచి రూ.4లక్షల రికవరీ
- టీడీపీ నేతల అక్రమాలకు బలైన అధికారి



ప్రభుత్వం అందించే వరి విత్తనాలు

గంట్యాడ: గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నాయకుల నుంచి జన్మభూమి కమిటీల వరకు ప్రజలను దోపిడీ చేయడమే పని. ఏ ప్రభుత్వ పథకం మంజూరు కావాలన్నా డబ్బులు ముట్టజెప్పాల్సిందే. కేంద్ర ప్రభుత్వ పథకాల్లోనూ చిలక్కొట్టుడే. గ్రామ స్థాయిలో ప్రజలను జలగల్లా పీల్చిపిప్పిచేసేవారంటూ టీడీపీ నాయకుల అరాచకపాలనను రచ్చబండలపై ఇప్పటికీ కొందరు చర్చిస్తున్నారు. చివరకు రాయితీపై రైతులకు పంపిణీ చేసే విత్తనాలనూ దోపిడీ చేసేవారు. దీనిని ప్రశ్నించిన అధికారులను భయపెట్టేవారు. ఇలా.. టీడీపీ నాయకుల దౌర్జన్య పాలనకు ఓ అధికారి బలయ్యాడు. సుమారు రూ.4లక్షల చేతిసొమ్మును చెల్లించాడంటూ గంట్యాడ మండల ప్రజలు ప్రస్తావిస్తున్నారు. రైతు రథాలు పేరిట ప్రజాధనంతో కొనుగోలుచేసినా ట్రాక్టర్లను సైతం టీడీపీ కార్యకర్తలు, నాయకులే సొంతం చేసుకున్నారన్న విమర్శలు ఉన్నాయి.

అధికారులకు బెదిరింపులు..

టీడీపీ అధికారంలో ఉన్న 2017-18 కాలంలో రైతులకు రాయితీపై సొసైటీలు, మండల వ్యవసాయ అధికారి కార్యాలయం వద్ద పంపిణీ చేసే విత్తనాలను గంట్యాడ మండలంలో అడ్డదారిలో తరలించేశారు. అప్పట్లో గంట్యాడ సొసైటీకి వచ్చిన వరి విత్తనాలు 1000 బస్తాలు (30 కేజీలవి) రాత్రికి రాత్రే టీడీపీ నాయకులు వారి ఇళ్లకు తరలించేశారు. వారి అనుయాయులకు పప్పు బెల్లాలు మాదిరిగా పంచేశారు. కొందరైతే అధిక ధరకు రైతులకు తిరిగి విక్రయించారు. ఈ విషయం అప్పట్లో పత్రికల్లో రావడంతో వ్యవసాయశాఖ ఉన్నత అధికారులు విచారణ చేపట్టారు. 1000 బస్తాల విత్తనాలు పక్కదారిపట్టినట్టు నిర్ధారించారు. అందుకు సొసైటీకి చెందిన ఓ అధికారిని బాధ్యుడిని చేసి విత్తనాల సొమ్ము రూ.4 లక్షలను రికవరీ చేశారు. ఈ ఘటన అప్పట్లో పెద్ద దుమారాన్నే రేపింది. ఇప్పటికీ ఆ అధికారి కుటుంబం ఆవేదన వ్యక్తంచేస్తోంది. టీడీపీ నాయకుల దోపిడీ పర్వానికి బలయ్యామంటూ గోడువెళ్లబోస్తోంది.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: గుర్తు తెలియని వ్యక్తి కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు వన్ టౌన్ పోలీసులు శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. ఎల్ఐసీ కార్యాలయం నుంచి బాలాజీ జంక్షన్ మధ్య ఉన్న రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండగా స్థానికుల సహాయంతో ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. ఈ మేరకు శనివారం అతను మృతి చెందినట్లు ఆస్పత్రి వైద్యులు ధ్రువీకరించారన్నారు. సుమారు 60 నుంచి 65 ఏళ్ల వయసు కలిగి ఉంటుందన్నారు. ఆచూకీ తెలిసిన వారు వన్ టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న ఎస్ఈబీ సీఐ

రాజాం సిటీ: మండల పరిధి కంచరాం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి గ్రామానికి చెందిన రౌతు పోలినాయుడు వద్ద 48 మద్యం బాటిళ్లను గుర్తించామని సీఐ బి.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు వాటిని స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేశామని తెలిపారు. అలాగే అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. ఎస్ఐలు చంద్రశేఖర్, శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దేవీ దండుమారమ్మ ఆలయం వద్ద అన్న సమారాధన

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎస్పీ ఎం.దీపిక


అమ్మవారికి భోగం పెడుతున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దేవీ దండుమారమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్నసమారాధన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ ఎం.దీపిక హాజరై, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాధువులకు, భక్తులకు భోజనాలను వడ్డించారు అనంతరం ఎం.దీపిక ఆలయ కమిటీ సభ్యులు, ఇతర పోలీసు అధికారులు అమ్మవారి ప్రసాదాలను స్వీకరించారు. ఇటీవల అమ్మవారి పండగ మహోత్సవాలను ఏప్రిల్ 9 నుంచి ఏప్రిల్ 16 వరకూ జిల్లా పోలీస్ శాఖ ఘనంగా నిర్వహించారు. మహోత్సవ ముగింపు వేడుకల్లో జిల్లా ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఆర్ఐలు ఎస్.గోపాలనాయుడు, రమేష్, ఆలయ కమిటీ సభ్యులు తాతరాజు, రవీశ్వరుడు, వాసు, శివ, లక్ష్మణ్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


రేగిడి: పంపుషెడ్ వద్ద మృతి చెందిన రైతు, (ఇన్‌సెట్లో) ఆలుబిల్లి అప్పలనాయుడు (ఫైల్)

రేగిడి/పాలకొండ రూరల్: రేగిడి మండలంలోని బొడ్డవలస గ్రామంలో చెరకు పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ మండలం అంపిలి గ్రామానికి చెందిన రైతు ఆలుబిల్లి అప్పలనాయుడు(60) శనివారం ఉదయం నాగావళి నదికి ఆవలివైపు ఉన్న రేగిడి మండలంలోని బొడ్డవలసలో మోటార్ బోరు ద్వారా పంటకు నీటిని అందించే క్రమంలో పంప్‌షెడ్ వద్ద విద్యుత్ షాక్‌కు గురయ్యాడు.

ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో మృత్యువాతపడ్డాడు. కొద్ది సేపటి తర్వాత ఈ ప్రమాదాన్ని గుర్తించిన సహచర రైతులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కుటుంబ పెద్ద పొలంలో మరణించడాన్ని చూసిన కుటుంబీకులు గుండెలు పగిలేలా రోదించారు. అంపిలి గ్రామస్తులు, వైస్ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్, సర్పంచ లోలుగు విశ్వేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతుని భార్య నాగమ్మ, ముగ్గురు పిల్లలను ఓదార్చారు. ఈ ఘటనపై రేగిడి పోలీసులు కేసు నమోదు చేశారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

వైఎస్సార్‌సీపీ విస్తృత ప్రచారం


నెల్లిమర్ల రూరల్: గుషిణిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు


సంతకవిటి: సిరిపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్


బొబ్బిలి: పట్టణంలో ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి


కొత్తవలస: రామలింగాపురం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

సార్వత్రిక ఎన్నికల సమరం సమీపిస్తున్న వేళ బరిలో నిలిచిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. సంక్షేమ పాలన, అభివృద్ధికి రాష్ట్రంలో మరోసారి జగనన్న ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని అభ్యర్థులు ఓటర్లకు వివరిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. – సాక్షి నెట్‌వర్క్


గజపతినగరం రూరల్: పాత శ్రీరంగరాజపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

వెదుళ్లవలసలో హత్య

- అల్లుడిని హతమార్చిన అత్త, మామ, భార్య


మృతుడు కొలుసు అప్పన్న (ఫైల్)

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో హత్య జరిగింది. గ్రామంలోని యాత వీధిలో అత్త, మామ, భార్య ముగ్గురూ కలిసి శుక్రవారం రాత్రి 10 గంటల సమయం దాటిన తరువాత కొలుసు అప్పన్న (30)ను హత్య చేయటంతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని యాతవీధిలో మృతుడు కొలుసు అప్పన్న, భార్య కొలుసు దేవి నివాసం ఉంటున్నారు. వీరిద్దరితో పాటు మృతుడు అప్పన్న అత్త, మామలు ముంత సన్యాసిరావు, ముంత ఎల్లమ్మలు కూడా ఒకే ఇంటిలో కలిసి ఉంటున్నారు. మృతునికి అత్తమామలు సొంత అక్క, బావ కాగా మేనకోడలు దేవిని వివాహం చేసుకున్నాడు. అప్పన్న లారీ క్లీనర్‌గా దూర ప్రాంతాల్లో పని చేయడానికి వెళ్లి అప్పుడప్పుడు వస్తుంటాడు. భార్యాభర్తలైన అప్పన్న, దేవి మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో అప్పన్నను ఎలాగైనా హతమార్చాలనే ఉద్దేశంతో శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో భార్యతో పాటు అత్తమామలు కలసి అప్పన్నను హత్య చేశారు. భార్య దేవి చున్నీతో అప్పన్న మెడను బిగబెట్టి ఊపిరాడకుండా చేయగా అత్త, మామలు రాయితో తలపై మోది హత్య చేశారు. మృతునికి ఏడాదిన్నర పాప, నెలల బాబు ఉన్నాడు. సంఘటన స్థలాన్ని సీఐ షణ్ముఖరావు, ఎస్ఐ దామోదరరావు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

రాజాం సిటీ: స్థానిక శ్రీకాకుళం రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేశామని ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు. ఈ నెల 18న సైకిల్‌పై రాజాం వైపు వస్తున్న నేచురల్ సెలూన్‌లో పని చేస్తున్న విక్రమ్‌ను ఎదురుగా వస్తున్న వ్యక్తి ద్విచక్ర వాహనంతో ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఈ మేరకు సెలూన్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బొత్స చొరవతో.. మిమ్స్‌లో సమ్మె విరమణ


విధుల్లో చేరేందుకు వెళ్తున్న మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు

నెల్లిమర్ల: మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు ఎట్టకేలకు సమ్మె విరమించారు. మంత్రి బొత్స సత్యనారాయణ చొరవతో సమస్య కొలిక్కి వచ్చింది. ఆమోదయోగ్యమైన ఒప్పందంతో సీఐటీయూ సమ్మె విరమణకు అంగీకరించింది. 7.5 శాతం మేర ప్రతీ ఏడాది వేతనం పెంపు, డీఏలు అమలుతో పాటు ఉద్యోగుల మీద వేధింపులు లేకుండా వీలుగా ఒప్పందం జరిగింది. అలాగే జైలులో ఉన్న మిమ్స్ ఉద్యోగులు అందరూ బెయిల్ మీద జైలు నుంచి బయటకు వచ్చారు. ఆ మేరకు శుక్రవారం జరిగిన బహిరంగ సభలో సమ్మె విరమణకు నిర్ణయించారు. దీంతో మిమ్స్ ఉద్యోగులంతా శనివారం విధులకు హాజరయ్యారు. పూర్తి స్థాయిలో మిమ్స్‌లో కార్యకలాపాలు పునఃప్రారంభమయ్యాయి.

మాయలోడు.. మళ్లీ వస్తున్నాడు...

- ఎస్.కోట నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటన రేపు
- అబద్ధాలు చెప్పేందుక మళ్లీ వస్తున్నాడంటున్న జనం
- గతంలో ఇచ్చిన హామీలన్నీ హుష్‌కాకి
- జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో సమకూరిన సదుపాయాలు


దేవదాయశాఖ నిధులతో ఇటీవల నిర్మించిన రామాలయం


జమ్మాదేవిపేటలో నిర్మించిన సచివాలయ భవనం


నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు

లక్కవరపుకోట: మండలంలోని అరకు–విశాఖ రోడ్డును ఆనుకొని ఉన్న జమ్మాదేవిపేట గ్రామంలో గతంలో రాష్ట్ర పంచాయతీ, ఐటీ శాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ 2017 నవంబర్ 12వ తేదీన, ఆయన తండ్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో నవనిర్మాణ దీక్షలో భాగంగా 2018 జూన్ 4వ తేదీన పర్యటించారు. అధికార హోదాలో తండ్రీకొడుకులు మంత్రులు, ఎమ్మెల్యేలను, కలెక్టర్‌ను వెంట పెట్టుకొని అధికార దర్పణం ఒలగబోస్తూ లక్షల ప్రజాధనాన్ని వెచ్చించి గ్రామంలో పర్యటించారు. అప్పట్లో గ్రామంలో ప్రతీ ఇంటికీ తాగునీటి కుళాయి కనక్షన్లు పెడతామని హామీ ఇచ్చారు. అందుకు అయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. ఆ హామీ నీటి మీద రాతలుగానే మిగిలాయి. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన సభకు సర్పంచ్ మొయ్యి కన్నయ్య అధ్యక్షత వహించాల్సి ఉండగా కనీసం ఆయనను ఆహ్వానించలేదు. కేవలం దళిత సర్పంచ్ అని వివక్ష చూపారు. ఆయనతోనే గ్రామంలో పార్టీ జెండాలను కట్టించుకున్నారు. గ్రామంలో రామాలయం పునర్నిర్మిస్తామని, కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తామంటూ సుమారు రూ.3కోట్ల విలువైన పనుల నిర్వహణకు హామీలిచ్చారు. ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఎస్.కోట నియోజకవర్గానికి ఈ నెల 22న చంద్రబాబు మళ్లీ వస్తుండడంతో... మాయలోడు మళ్లీ వస్తు న్నాడంటూ గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

జగనన్న హయాంలో అభివృద్ధి

2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జమ్మాదేవిపేట అభివృద్ధిపై సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామంలో రూ.32 లక్షలతో గ్రామ సచివాలయ భవనం నిర్మించారు. రామాలయం నిర్మాణానికి దేవదాయధర్మాదాయ శాఖ నుంచి రూ.48 లక్షలు కేటాయించారు. సుమారు 8 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజ్‌లను నిర్మించారు. జల్‌జీవన్ మిషన్ కింద రూ.63లక్షల ఖర్చుతో ఇంటింట కుళాయిలు ఏర్పాటు చేశారు.

● పకడ్బందీగా పాలిసెట్


అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్ఓ అనిత

- డీఆర్ఓ ఎస్‌డీ అనిత

విజయనగరం అర్బన్: ఈ నెల 27న జరిగే పాలిసెట్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీ అనిత ఆదేశించారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష – 2024 నిర్వహణపై తన చాంబర్‌లో శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ ఈ నెల 27న నిర్వహించే పరీక్షకు సుమారు 8,864 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. విజయనగరంలో 11, గజపతినగరంలో 6, బొబ్బిలిలో 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. విజయనగరం సెంటర్లలో 4,509, గజపతినగరంలో 2,009 మంది, బొబ్బిలిలో 2,346 విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందని, విద్యార్థులను గంట ముందు లోపలికి అనుమతిస్తామని తెలిపారు. ఎట్టి పరిస్థితిలోనూ 11 గంటల తరువాత ఒక్క నిమిషం దాటినా లోపలికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఎటువంటి లోపాలు లేకుండా పరీక్షకు ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు తాగునీరు, ప్రాథమిక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాలిసెట్‌కు సంబంధించి ఇతర వివరాల కోసం సెల్ నెంబర్ 79897 81520 నెంబర్‌కు సంప్రదించాలని డీఆర్ఓ సూచించారు. సమావేశంలో పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్ ఆషారాణి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, విద్య, విద్యుత్, వైద్యారోగ్య, పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, పరీక్షా కేంద్రాల కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర ప్రాంతీయ చిత్రానికి ఆడిషన్స్


ఆడిషన్స్ నిర్వహిస్తున్న సంస్థ నిర్వాహకులు

విజయనగరం క్రైమ్: ప్రముఖ సినీ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఉత్తరాంధ్ర ప్రాంతీయ చిత్రానికి సంబంధించి పట్టణంలోని కణపాక యూత్ హాస్టల్‌లో రెండు రోజుల పాటూ నటీనటుల ఎంపికకు సంబంధించి ఆడిషన్స్ నిర్వహిస్తున్నామని సంస్థ ప్రతినిధి జానకీరామ్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన ఆడిషన్స్‌లో నటులు అద్భుతమైన నటనాప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జానపద కళాకారిణి జీవితంలో యధార్థ సంఘటనలు ఆధారంగా చేసుకుని రూపొందిస్తున్న చిత్రానికి కళాకారులను ఎంపిక చేస్తున్నామన్నారు. ఉత్తరాంధ్ర మాండలికంతో పాటు కిన్నెర, జముకుల కథ, తప్పెట గుళ్లు, వీధి నాటక కళాకారులు కూడా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇదొక సువర్ణ అవకాశమన్నారు. 21న ఆదివారం కూడా ఆడిషన్స్ ఉంటాయన్నారు. 22, 23 తేదీల్లో విశాఖ సిటీ బీచ్ రోడ్డులో వైఎంసీఏ అపోజిట్‌లో ఉన్న యూత్ హాస్టల్, వైఎస్‌సీపీ కిర్లంపూడి లేఅవుట్ వద్ద జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వికాస్, గాయకులు జానకీరామ్, నంది అవార్డు గ్రహీత తిరుపతినాయుడు మాస్టారు, గెద్ద వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అత్యుత్సాహం!

- ఉపాధిహామీ పనుల్లో చంద్రబాబు బర్త్‌డే వేడుకలు


బొద్దాంలో ఉపాధిహామీ పనుల వద్ద చంద్రబాబు నాయుడు బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న దృశ్యం

రాజాం: మండలంలోని బొద్దాం పంచాయతీ పరిధిలోని పూను గుండమ్మ చెరువు, అప్పయ్య బండ, జగ్గువానిచెరువు, భగవాన్ సాగర్ చెరువుల్లో శనివారం ఉపాధి పనులు జరిగాయి. మధ్యాహ్నం 4 గంటల సమయంలో కొంతమంది టీడీపీ కార్యకర్తలు పనులు వద్దకు చేరుకుని చంద్రబాబు బర్త్‌డే కేక్ కట్ చేశారు. వేతనదారులకు కూల్ డ్రింక్‌లు పంపిణీ చేశారు. పంచాయతీకి చెందిన టీడీపీ కార్యకర్తలు ఈ తంతు నిర్వహిస్తుండగా, ఉపాధి పనుల ఫీల్డ్ అసిస్టెంట్ బైరి ఆదినారాయణ అక్కడే ఉన్నట్టు తెలిసింది. ఓ వైపు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుండగా టీడీపీ కార్యకర్తలు ఓటర్లను ప్రలోబాలకు గురిచేయడాన్ని కొందరు వేతనదారులు వ్యతిరేకించారు. ఈ విషయాన్ని రాజాం ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు వద్ద 'సాక్షి' ప్రస్తావించగా బొద్దాంలో ఉపాధి పనుల్లో పాల్గొనే వేతనదారులకు టీడీపీ కార్యకర్తలు కూల్ డ్రింక్‌లు పంపిణీ చేసినట్టు తెలిసిందన్నారు. ఆ సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్ బైరి ఆదినారాయణ అక్కడ లేడని చెప్పారన్నారు. అయితే, ఉపాధి పనుల మస్టర్ షీట్‌లో అన్ని పనుల వద్ద ఫీల్డ్ అసిస్టెంట్ హాజరైనట్టు సంతకాలు ఉన్నాయి. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.